క్లుప్తంగా

తహసీల్దార్ల బదిలీ

మంచిర్యాలఅగ్రికల్చర్: మల్టీజోన్ పరిధిలో పనిచేస్తున్న ముగ్గురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ రాష్ట్ర ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ లోకేష్‌కుమార్ గత నెల 6న ఉత్తర్వులు జారీ చేయగా, భూ భారతి రెవెన్యూ దరఖాస్తుల పరిశీలనలో భాగంగా రిలీవ్ కాలేదు. కలెక్టర్ కుమార్‌దీపక్ బుధవారం రిలీవ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. వేమనపల్లి మండలం తహ సీల్దార్ సంధ్యారాణి నిర్మల్ జిల్లాకు బదిలీ కాగా, ఆమె స్థానంలో కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో పనిచేస్తున్న పుష్పలతను కేటాయించారు. కాసిపేట మండలం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్న బి.సాయిబాబు జిల్లా కలెక్టరేట్ ఎఫ్‌సెక్షన్ సూపరింటెండెంట్‌గా, కలెక్టరేట్ సీ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉన్న సునీల్‌కుమార్‌ను కాసిపేట మండలం తహసీల్దార్‌గా కేటాయించారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలి



విద్యార్థి ప్రతిభను పరిశీలిస్తున్న లక్ష్మణ్

దండేపల్లి: విద్యార్థుల్లో చదవడం, రాయడం వంటి నైపుణ్యాలను పెంచాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సీహెచ్.లక్ష్మణ్ అన్నారు. దండేపల్లి మండలంలోని రాజుగూడ, కుంటలగూడ కట్ట గిరిజన ప్రాథమిక పాఠశాలలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిష్టర్లు తనిఖీ చేశారు. విద్యార్థుల ప్రతిభ సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పాఠాలు బోధించాడు. ఆయన వెంట జన్నారం కాంప్లెక్స్ ఎస్‌సీఆర్పీ రఘునాథం ఉన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

కాసిపేట: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని గురువారం సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి డిమాండ్ చేశారు. మండలంలోని మల్కేపల్లి గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను సీపీఎం నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. హాస్టల్లో 158మంది విద్యార్థులుండగా, సోలార్ గీజర్ చెడిపోవడంతో విద్యార్థులు చన్నీళ్లతో స్నానాలు చేస్తున్నట్లు, రెండేళ్లుగా మరమ్మతు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. అదనపు గదుల నిర్మాణాన్ని అసంపూర్తి వదిలేశారన్నారు. వెంటనే ఐటీడీఏ, జిల్లా అధికారులు, ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు సిడాం జంగుభాయి, పాయిరాల రాములు తదితరులు ఉన్నారు.

పింఛన్లు చెల్లించాలని నిరసన



నిరసన తెలుపుతున్న పింఛన్‌దారులు

కాసిపేట: మండలంలోని మల్కేపల్లిలో తమ పింఛన్‌లు చెల్లించాలని వృద్ధులు, వితంతులు, వికలాంగులు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ప్రతీనెల సకాలంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో అవస్థలు పడుతున్నామన్నారు. ఒక్కనెల పింఛన్ తీసుకోకపోయినా, పింఛన్ రద్దు అవుతుందని భయంతో గడపాల్సి వస్తుందని వాపోయారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి లబ్ధిదారులకు ప్రతీనెల సక్రమంగా పింఛన్‌లు ఇచ్చేలా చూడాలని కోరారు. పింఛన్‌లు ఇస్తామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు సిడాం జంగుభాయి, కుడిమేత భూమయ్య, పింఛన్ దారులు పాల్గొన్నారు.

జనారణ్యంలోకి చుక్కల దుప్పి



ఊర్లో సంచరిస్తున్న చుక్కల దుప్పి

వేమనపల్లి: మేత కోసం పత్తి చేళ్లలోకి వచ్చిన చుక్కల దుప్పి దారితప్పి మండలంలోని కేతన్‌పల్లి గ్రామంలోకి వచ్చింది. గమనించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. డెప్యూటీ రేంజ్ అధికారి ప్రమోద్‌కుమార్, ఎఫ్‌బీవో మహిపాల్ చుక్కల దుప్పిని అనుసరించారు. కుక్కలు వెంబడించకుండా రక్షణ కల్పించారు. సుమారు 2 గంటలు కేతన్‌పల్లి గ్రామంలోనే చెక్కర్లు కొట్టింది. అనంతరం అటవీ అధికారులు ఫారెస్ట్‌వైపు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. సహకరించిన గ్రామస్తులను రేంజ్ అధికారి హఫీజొద్దీన్ అభినందించారు.



దుర్గంధంతో అవస్థలు..!

భీమారం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు చెందిన వ్యర్థాలు తరలించేందుకు ఏర్పాటు చేసిన పైపులైను పై కప్పు ఏర్పాటు చేయలేదు. దీంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయంలో అధికారులు చర్యలు తీసుకొని పై కప్పు బిగించాలని కోరుతున్నారు.



అందని ఆయుర్వేద వైద్యం

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలో ఆయుర్వేద వైద్యం అందని ద్రాక్షలా మారింది. వైద్యులు, సిబ్బంది లేక నెల రోజులుగా వైద్యశాల తెరుచుకోవడం లేదు. ప్రస్తుతం వైద్యశాల మూతపడటంతో రోగులు ఆందోళన చెందుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని రెగ్యులర్‌గా వైద్యుడిని నియమించాలని కన్నెపల్లి, భీమిని మండల ప్రజలు కోరుతున్నారు.



ప్రభుత్వ కార్యాలయం ముందే ఇలా!

దండేపల్లి: దండేపల్లి మండల కేంద్రంలోని గిరిజన ఉప కార్యనిర్వహణ ఇంజనీర్ కార్యాలయం ఎదుట వర్షం నీళ్లు నిలిచి అధ్వానంగా ఉంది. కార్యాలయంలోనికి వెళ్లేందుకు ప్రజలు, అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ కార్యాలయం ముందే ఇలా వర్షం నీళ్లు నిలిచి ఉంటే ఎలా అని పలువురు ప్రశ్నిస్తున్నారు.

వినాయకా.. వీడ్కోలిక



రిమోట్ కారులో తరలివెళ్తున్న గణనాథుడు



కోటపల్లిలో గణేశ్ నిమజ్జన వేడుకలు



భీమారం మండలం ఎలకేశ్వరంలో...

- కనుల పండువగా గణేశ్ నిమజ్జనం
- బందోబస్తు నిర్వహించిన పోలీసులు

చెన్నూర్/కోటపల్లి/భీమారం/తాండూర్: చెన్నూర్ పట్టణం, భీమారం మండలంలోని ఎలకేశ్వరం, తాండూర్ గ్రామం, కోటపల్లి మండలంలోని కోటపల్లి, రాపన్‌పల్లి, రాంపూర్ గ్రామాల్లో గురువారం గణేశ్ నిమజ్జన వేడుకలు ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు అందుకున్న గణనాథులకు భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు. భాజా భజంత్రీలు, డీజే చప్పుళ్లు, మహిళల కోలాటాలు, నృత్యాలతో గణనాథుని ఘనంగా సాగనంపారు. జై బోలో గణేశ్ మహారాజ్ కి జై అంటూ చెరువుల్లో నిమజ్జనం చేశారు. చెన్నూర్‌లో గణేశ్ నిమజ్జన వేడుకల్లో ఎలాంటి అపశ్రుతి జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. చెన్నూర్‌లో నిమజ్జన కార్యక్రమం శుక్రవారం ఉదయం వరకు కొనసాగే అవకాశాలు ఉన్నాయి.



చెన్నూర్: బట్టిగూడెం లక్ష్మీ ముధిరాజ్ గణేశ్



తాండూర్: శోభాయాత్రలో భక్తులు



చిన్న గణనాథుని సైకిల్‌పై నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు, చిన్నారులు



చెన్నూర్ పెద్ద చెరువులో నిమజ్జనం చేసేందుకు పడవలో తీసుకెళ్తున్న జాలర్లు



చెన్నూర్ పెద్ద చెరువులో క్రేన్‌తో నిమజ్జనం చేస్తున్న దృశ్యం

విద్యారంగ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కలెక్టర్ కుమార్‌దీపక్

తాండూర్: ప్రభుత్వ విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా, విద్యారంగ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గురువారం షెడ్యూల్ట్ తెగల సంక్షేమ వసతి గృహ నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందించే దిశగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఇందులో భాగంగానే ఎస్టీ సంక్షేమ వసతి గృహాన్ని మండలంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ జోత్స్న, మండల విద్యాశాఖ అధికారి మల్లేశం, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పద్మజ, ప్రధానోపాధ్యాయుడు విద్యాసాగర్ ఉన్నారు.

గణనాథునికి కలెక్టర్, సీపీ పూజలు

తాండూర్ ఐబీ శ్రీ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడికి కలెక్టర్ కుమార్ దీపక్, సీపీ అంబర్ కిషోర్ ఝా, అధికారులు పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక అధికారులు, కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నిమజ్జన ఏర్పాట్లు పరిశీలన

జైపూర్/తాండూర్: పెద్దపల్లి-మంచిర్యాల జిల్లా సరిహద్దు గోదావరి బ్రిడ్జిపై, తాండూర్ పెద్ద చెరువు ప్రాంతంలో గణపతి నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ కుమార్‌దీపక్, రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా గురువారం పరిశీలించారు. వినాయక శోభాయాత్రలో ఎలాంటి అపశృతులకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. గణపతి నిమజ్జనం చేయడానికి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేశారు. రూట్ మ్యాప్స్, పోలీస్ బందోబస్తుపై సూచనలు చేశారు. ట్రాఫిక్ సమస్యలు రాకుండా అన్నిరకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ కుమార్, జైపూర్, మంచిర్యాల ఏసీపీలు వెంకటేశ్వర్, ప్రకాశ్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ జోత్స్న, సీఐ దేవయ్య, ఎస్సై కిరణ్‌కుమార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఎజాజుద్దీన్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.



వినాయకుడికి పూజలు చేస్తున్న అధికారులు

కలెక్టర్‌ను కలిసిన జీఎం

మందమర్రిరూరల్: కలెక్టర్ కుమార్‌దీపక్‌ను మంచిర్యాలలోని కలెక్టర్ ఆఫీస్‌లో మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ గురువారం కలిసి శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి ఘనంగా సన్మానించారు. ఏరియాలోని సింగరేణి పరిస్థితులను ఆయనకు వివరించారు. జిల్లా ఫారెస్ట్ ఆఫీస్‌లో డీఎఫ్‌వో శివ ఆశిష్‌సింగ్‌ను కలిసి శాలువా కప్పి సన్మానించి, ఏరియాలోని ఆర్కే ఓసీ ఫారెస్ట్ ల్యాండ్ డైవర్షన్ గురించి చర్చించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

మంచిర్యాలక్రైం/లక్సెట్టిపేట: గణేశ్ నవరాత్రి ఉత్సవాలు ముగించుకొని ఈ నెల 6న శోభాయాత్ర, నిమజ్జనం కార్యక్రమంలో నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో గురువారం హిందూ ఉత్సవ కమిటీ, వినాయక మండపాల కమిటీ సభ్యులు, ముస్లిం, క్రిష్టియన్ మత పెద్దలతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కులమతాలకతీతంగా శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. రూట్‌మ్యాప్ ద్వారానే శోభాయాత్ర నిర్వహించాలన్నారు. లక్సెట్టిపేట గోదావరి నది వద్ద వినాయక నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు. డీజే, బాణసంచా కాల్చేందుకు అనుమతులు లేవన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సంపత్‌కుమార్, సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, తహసీల్దార్ రఫతుల్లా హుస్సేన్, లక్సెట్టిపేటలో తహసీల్దార్ దిలీప్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ విజయ్‌కుమార్, సీఐ రమణామూర్తి, ఎస్సై గోపతి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏసీపీ ప్రకాశ్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట ఎల్లంపల్లి ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్‌లో గణేశ్ నిమజ్జన ఏర్పాట్లకు సంబంధించి గురువారం అధికారులు విస్తృత పరిశీలన చేపట్టారు. కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్, మేనేజర్ కరుణాకర్, మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వైకుంఠం, బిల్ కలెక్టర్ గడ్డం శంకర్ ప్రాజెక్ట్ బ్యాక్ వాటర్ పరిసరాలను పర్యవేక్షించి నిమజ్జనం చేసే ప్రాంతాలను ఎంపిక చేశారు. హాజీపూర్ మండలంలోని గ్రామాలతో పాటు కార్పొరేషన్ పరిధిలోని గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్, ముల్కల్ల, వేంపల్లి పరిధిలో గల చిన్నచిన్న విగ్రహాలు మాత్రమే బ్యాక్ వాటర్‌లో నిమజ్జనం చేసేలా అనుమతి ఇస్తున్నట్లు తెలిపారు.

'నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకుందాం'

మందమర్రిరూరల్: మందమర్రిలో నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకుందామని హిందూ ఉత్సవ కమిటీ పేర్కొంది. పట్టణంలోని పాత బస్టాండ్ కూడలి వద్ద ప్రత్యేక షెల్టర్ ఏర్పాటు చేసినట్లు, గణపతి ప్రతిమలకు స్వాగతం పలికి సాగనంపనున్నట్లు కమిటీ పేర్కొంది.

గుండాల బీటీ రోడ్డుకు రూ.25 కోట్లు

దండేపల్లి: మండల కేంద్రం నుంచి ఊట్ల మీదుగా కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం గుండాల గిరిజన గ్రామానికి వెళ్లే ఘాట్ రోడ్డును బీటీగా మార్చేందుకు రూ.25 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర గిరిజన సహకార కార్పొరేషన్ చైర్మన్ కోట్నాక తిరుపతి తెలిపారు. రోడ్డు దుస్థితిని ఉన్నతాధికారుల ద్వారా పరిశీలన చేయించి, సమస్యను మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు, రాష్ట్ర మంత్రి సీతక్క దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు. వారు స్పందించి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారని పేర్కొన్నారు. ఈమేరకు మంత్రి సీతక్క హైదరాబాద్‌లో తన కార్యాలయంలో రోడ్డు నిర్మాణానికి సంబంధించిన నిధుల మంజూరు పత్రాన్ని తిరుపతికి అందించారు.



తిరుపతికి మంజూరు పత్రం అందిస్తున్న మంత్రి సీతక్క

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..!



దండేపల్లిలో టీచర్స్ డే వేడుకల్లో ఉపాధ్యాయులు

- ముందస్తుగా టీచర్స్ డే వేడుకలు

మంచిర్యాలఅర్బన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా గురువారం స్థానిక టీజీ మోడల్‌స్కూల్లో గురువారం ముందస్తు టీచర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులకు వివిధ రకాల ఆటలు, వినోదాత్మక పోటీలు నిర్వహించారు. విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పెంపొందించే ఉద్దేశంతో సెల్ఫ్ గవర్నమెంట్ డేను జరిపారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. సాంస్కృతిక పోటీలు అలరించాయి. తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ బుచ్చన్న, సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పాండురంగ శర్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాండూర్/కాసిపేట/భీమిని/దండేపల్లి/రామకృష్ణాపూర్: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పాఠశాలల్లో ముందస్తుగా గురువారం ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులను విద్యార్థులు ఘనంగా సన్మానించారు. జైపూర్ మండల కేంద్రంలో గల ఎమ్మార్సీ కార్యాలయంలో, కాసిపేట మండల విద్యావనరుల కేంద్రంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి స్మరించుకున్నారు. రామకృష్ణాపూర్‌లోని పట్టణంలోని సెయింట్‌జాన్స్ హైస్కూల్, ఎస్‌ఆర్‌కే పాఠశాలల్లో, దండేపల్లి మండలంలోని వెల్గనూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాండూర్‌లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన జయప్రద, స్వరూప, ఉమాదేవి, దేవదాస్, నాగరాణి, సుధారాణి, ఎం.నరేందర్‌లను మండల విద్యాశాఖ అధికారి మల్లేశం సత్కరించారు. దండేపల్లిలో జిల్లా బాలికల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, కాసిపేటలో మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి, జైపూర్‌లో ఎంపీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాలఅర్బన్: ప్రిన్సిపాల్‌ను సన్మానిస్తూ...



తాండూర్: ఉపాధ్యాయులతో అధికారులు

బీజేపీ నాయకుల రాస్తారోకో



రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

లక్సెట్టిపేట: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ నాయకులు గురువారం స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథరావు మాట్లాడారు. రైతులు ఎదుర్కొంటున్న యూరియా సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని ఆరోపించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి తహసీల్దార్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు హరిగోపాల్, స్వామిరెడ్డి, కృష్ణమూర్తి, ప్రభాకర్, కిషన్, సతీష్, వెంకటరమణ, బొక్కనపల్లి సతీష్, రాజేందర్, రాజగురువయ్య, మధుకర్ పాల్గొన్నారు.

నియామకం

జైపూర్: జాతీయ మాలమహానాడు చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా జైపూర్ మండలం గంగిపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం వెంకటేశ్‌ను నియమించినట్లు మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జీలు ఆయా మండలాల్లో నూతన కమిటీలు ఏర్పా టు చేయాలని ఆదేశిస్తున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

వినాయకులకు పూజలు

మంచిర్యాలఅర్బన్/జన్నారం/దండేపల్లి/భీమిని/మంచిర్యాలరూరల్(హాజీపూర్): వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా వినాయకుడికి భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జన్నారంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, దండేపల్లి మండలం ఎల్లయ్యపల్లె సమీపంలో భజరంగ్‌దళ్ గణేశ్ మండలి వద్ద, కన్నెపల్లి మండలంలోని జన్కాపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు 108రకాల నైవేద్యాలు సమర్పించారు. దండేపల్లి మండలంలోని తాళ్లపేటలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన గణనాథుడి వద్ద ముస్లిం నాయకుడు ముస్తఫా, హాజీపూర్ మండలం నంనూర్‌లోని యువ గణేశ్ మండలి వద్ద ముస్లిం మహిళలు భక్తులకు అన్నదానం చేశారు.

'యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత'

తాండూర్: రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరతకు కేంద్ర ప్రభుత్వ అలసత్వమే కారణమని, రైతుల ఇబ్బందులకు కేంద్రమే బాధ్యత వహించాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. తాండూర్ మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు పలుమార్లు కేంద్రం దృష్టికి యూరియా కొరత సమస్య తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఈసా, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ ఆఫీసర్‌కు సన్మానం

దండేపల్లి: మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్ మేనేజరుగా పదోన్నతి పొంది నిజామాబాద్‌కు బదిలీ అయ్యారు. దండేపల్లిలోని శ్రీ శివ గణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో గురువారం ఆయనను శాలువాలతో ఘనంగా సన్మానించారు. బ్యాంకు వద్ద పలువురు ఖాతా దారులు, వ్యాపారులు ఐకేపీ సిబ్బంది శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందించారు.

'తక్కువ ఖర్చుతోనే విద్య'

చెన్నూర్‌రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ రెగ్యులర్‌గా చదువుకోని వారికి తక్కువ ఖర్చుతోనే నాణ్యమైన విద్యను అందిస్తుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ విద్యార్థి సేవా విభాగం డైరెక్టర్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. ఓపెన్ యూనివర్సిటీ అడ్మిషన్ల పెంపుదలలో భాగంగా మండలంలోని కిష్టంపేట గ్రామంలోని చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన గురువారం సందర్శించారు.